క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ తప్పక హాజరు కావాలన్నారు. అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి వివరాలతో రావాలని కోరారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1,50,516 విరాళం



పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు కాజ్‌వే పక్కన నిర్మాణంలో ఉన్న శ్రీఅయ్యప్ప స్వామి ఆలయానికి బుధవారం గ్రామానికి చెందిన వేమూరి వెంకట నరసింహారావు(పెదబాబు), పాండురంగారావు రూ.1,50,516 విరాళాన్ని ఆలయ నిర్మాణ నిర్వాహకులు వాసిరెడ్డి బెనర్జీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వెంకట నరసింహారావు కుటుంబసభ్యులు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు మహిళలకు గొర్రెలు పంపిణీ



వత్సవాయి: డ్వాక్రా గ్రూపు మహిళలకు బుధవారం గొర్రెలను పంపిణీ చేశారు. మండల సమాఖ్య కార్యాలయంలో ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, సర్పంచ్ భూక్యా సీతమ్మ లబ్ధిదారులకు వీటిని అందించారు. మొత్తం 10 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేసినట్లు మండల సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగిపోగు రమేష్, ఏపీఎం సుధారాణి, యేశపోగు శ్రీను, కొలుసు రాంబాబు తదితరులు పాల్గొన్నారు

చోరీకి గురవుతున్న మోటార్లు



వత్సవాయి: పొలాల్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ మోటార్లు మండలంలోని పలు గ్రామాల్లో చోరీకి గురవుతున్నాయి. ఇటీవల కాలంలో మండలంలోని మక్కపేట, మంగొల్లు గ్రామాల్లో వరుసగా సుమారు 20 మోటార్ల వరకు చోరీకి గురయినట్లు తెలుస్తోంది. ఒక్కొక్క మోటార్ విలువ రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంటుందని బాధిత రైతులు చెబుతున్నారు. బావులు, బోర్లు, ఎస్ఎస్పీ కాలువల వెంబడి ఉంచిన వాటిని రాత్రి సమయాల్లో దొంగిలిస్తున్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో పలు ఫిర్యాదులు ఉన్నాయి. ముఖ్యంగా మోటర్‌లో ఉండే రాగి వైరుకు డిమాండ్ ఉండడంతో దాని కోసమే వీటిని దొంగిలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్కసారి రాగి వైరును తీసుకుని మోటార్‌ను అక్కడే పడవేసి కూడా పోతున్నారు. పోలీసులు వీటిపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

మల్కాపురం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు



మల్కాపురం(జగ్గయ్యపేట): గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గ్రామానికి చెందిన అంబోజి పుల్లారావు (జాన్) నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆళ్ళ నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సర్పంచ్‌గా పని చేస్తున్న అంబోజి మణి 2022 మే నెలలో మృతి చెందారు. దీంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 19న ఉప ఎన్నిక జరగనుంది.

విద్యార్థులకు సత్కారం

వెల్లంకి(వీరులపాడు): ఫైనాన్షియల్ డిజిటల్ లిటరసీలో భాగంగా ఆర్‌బీఐ నిర్వహించిన క్విజ్ పోటీలలో మండలానికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవటం అభినందనీయమని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను అన్నారు. మండలంలోని వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు సంతోషి, నవ్యలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ప్రతిభను గుర్తించి అందుకనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుడమి తల్లికి ప్రణామం..వీరులారా వందనం



చిల్లకల్లులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ



కొణకంచిలో నా భూమి-నాదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

జగ్గయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మన భూమి–మన దేశం, వీరులకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తిరుమలగిరి, చిల్లకల్లు, అనుమంచిపల్లి, తక్కెళ్ళపాడు గ్రామాల్లో మన భూమి–మన దేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఎంపీడీవో ఎస్.వి. ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవం ముగింపు వేడుకల్లో భాగంగా మన భూమి– మన దేశం ఈ నెల 9 నుంచి 15 వరకు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచప్రాణ ప్రతిజ్ఞ, నేల తల్లికి వందనం, వీరులకు వందనం, జాతీయ జెండా ఎగురవేత వంటి కార్యక్రమాలను వారం రోజుల పాటు గ్రామాల్లో నిర్వహించాలన్నారు. శిలాఫలకాల వద్ద సెల్ఫీ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఎం సంతోష్, హౌసింగ్ ఏఈ ప్రకాశరావు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

మహనీయుల బాటలో అడుగులు వేయాలి

కొణకంచి, ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయుల బాటలో ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. ‘నా భూమి-నాదేశం-వీరులకు వందనం’ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా బుధవారం మండలంలోని కొణకంచి, ముండ్లపాడు జెడ్పీ హైస్కూళ్లలో శిలాఫలకం ఆవిష్కరణ, ప్రతిజ్ఞ, మొక్కలు నాటటం, కొవ్వొత్తులు వెలిగించటం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు దేశ స్వాతంత్య్రం కోసం త్యాగాలు చేసిన సేవలను కొనియాడారు. మహనీయుల చరిత్రపై అవగాహన ఉండటంతో పాటు అందరికీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కొణకంచి, ముండ్లపాడు గ్రామ సర్పంచ్‌లు గోనెల దేవి, గూడపాటి లావణ్య, వైస్ ఎంపీపీలు కనగాల శ్రీనివాసరావు, గుంటుపల్లి వాసు, ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, ఏపీఓ తిరుపతయ్య, హెచ్‌ఎం ఎం.రమణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కంచికచర్లలో నాభూమి–నాదేశం

కంచికచర్ల: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నా భూమి– నా దేశం, వీరులారా వందనం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. తొలుత మట్టిని సేకరించే సమయంలో సర్వమత గురువులు ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, ఎంపీడీఓ బాలశంకరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఎంఈఓ బాలాజీ, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, ఏపీఓ రమాదేవి, ఏపీఎం కోట భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.

మిక్, అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాలల్లో...

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాల, మండలంలోని పరిటాల అమ్రితసాయి, ఎంఈఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో మొక్కలు నాటారు.

నా భూమి నా దేశం కార్యక్రమంలో యువత పాల్గొనాలి

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నా భూమి– నా దేశం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి బొక్కా రవికుమార్ మాట్లాడుతూ నా భూమి– నాదేశం కార్యక్రమంలో యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ముందుగా మట్టిని సేకరించే సమయంలో సర్వమత గురువులు ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. ప్రతి గ్రామంలో సేకరించిన మట్టిని మండల కేంద్రానికి, అక్కడ నుంచి జిల్లా కేంద్రానికి, రాష్ట్ర రాజధానికి, అక్కడ నుంచి దేశ రాజధానికి పంపుతారన్నారు. మండలంలోని పరిటాల, మోగులూరు, గొట్టుముక్కల, కంచికచర్ల తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగిందని ఎంపీడీఓ బాలశంకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి బి.సుబ్బారావు, ఏపీఓ రమాదేవి, హెచ్‌ఎం రామకృష్ణ, హిందూ, ముస్లిం, క్రైస్తవ మత గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాచవరం సర్పంచ్ అభ్యర్థిగా గద్దె వెంకటేశ్వర్లు



దాచవరం సర్పంచ్ అభ్యర్థిగా వెంకటేశ్వర్లును ప్రకటిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

వీరులపాడు:ప్రజా ప్రతినిధులు మృతి చెందిన స్థానంలో వారి కుటుంబ సభ్యులు పోటీ చేస్తే ఏకగ్రీవంగా ఎన్నుకోవటం ఎన్నో ఏళ్లుగా ఆచారంగా వస్తోందని, దాచవరం సర్పంచ్ ఎన్నికలలో కూడా అదే ఆచారాన్ని కొనసాగించాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సర్పంచ్ గద్దె కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ గద్దె కోటేశ్వరరావు మృతి బాధాకరమన్నారు. సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. కోటేశ్వరరావు కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. అనంతరం మృతుడు కోటేశ్వరరావు తండ్రి వెంకటేశ్వర్లును దాచవరం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా అరుణకుమార్ ప్రకటించారు. గతంలో మాదిరిగా మృతుని కుటుంబం నుంచి పోటీ చేస్తున్న వ్యక్తికి ప్రతిపక్ష పార్టీలు మద్దతు పలికి ఏకగ్రీవంగా ప్రకటించాలని కోరారు. 2014 ఎన్నికలలో సైతం మాజీ ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకరరావు మృతి చెందగా ఆయన కుమార్తె సౌమ్య పోటీ చేశారని ఆ ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఉపసర్పంచ్ రత్న ప్రసాద్, నాయకులు తోట హరీష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి విషయంలో కావాలనే రాద్ధాంతం



రామన్నపేటలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ(చందర్లపాడు): రామన్నపేట గ్రామంలో తాగునీటి సమస్య సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు సంబంధించి కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో బుధవారం రాత్రి ఎమ్మెల్సీ గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడడానికి గ్రామ పంచాయతీ నిర్లక్ష్యమే కారణమన్నారు. సమస్య తమ దృష్టికి రాగానే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం ప్రతిరోజు తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా వినియోగించుకోవాలి



తిరుపతమ్మ గ్రూపునకు రుణం విడుదల చేస్తున్న కేడీసీసీబీ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు

గంపలగూడెం: బ్యాంక్‌ల ద్వారా రుణాలు తీసుకొంటున్న స్వయంసహాయక సంఘాల మహిళలు సక్రమంగా వినియోగించుకుని తమ ఆర్థిక పరిపుష్టితను పెంచుకోవాలని గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కేడీసీసీ బ్యాంక్‌లో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన పలు గ్రూపులకు మంజూరైన రుణాలను పంపిణీ చేశారు. పెద్దకొమిరకు చెందిన తిరుపతమ్మ, దుర్గామాధవి, లక్ష్మీభవానీ, చిన్నకొమిరకు చెందిన సరస్వతి, అనూష, కనుమూరుకు చెందిన దేవి, లక్ష్మి, సత్యవాణి, గాయత్రి స్వయం సహాయక సంఘాలకు మొత్తం రూ.1.03కోట్లు విడుదల చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఒక్కో గ్రూపుకు రూ.8లక్షల నుంచి రూ.15లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. సూపర్‌వైజర్ మల్లాది యేసోబు పాల్గొన్నారు.

● పేటకు ప్యాసింజర్ రైలు ఏర్పాటుకు వినతి



జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను బుధవారం సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే కార్యాలయంలో జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు.ప్యాసింజర్ రైలు ఏర్పాటు విషయమై రైల్వే ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఉదయభాను తెలిపారు.

–జగ్గయ్యపేట అర్బన్

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మరమ్మతులు



అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): గ్రామం నుంచి రామచంద్రునిపేటకు వెళ్లే రోడ్డుకు బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ రహదారి గుండా నిత్యం ప్రజలు, వ్యవసాయ కూలీలు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల రోడ్డు అంతా అధ్వానంగా తయారైంది. దీంతో గ్రామస్తులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి ప్రత్యేకంగా పొక్లెయినర్‌ను ఏర్పాటు చేసి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ పానుగంటి త్రివేణి నాయుడు పర్యవేక్షించారు. దీంతో గ్రామస్తులు, రైతులు ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రీడాకారులకు అభినందన



జగ్గయ్యపేటఅర్బన్: సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల అండర్–16 టోర్నమెంట్ కృష్ణాజిల్లా జట్టుకు జగ్గయ్యపేట పట్టణానికి చెందిన విద్యార్థులు రాజేష్, సాయి, చరణ్ ఎంపిక కావడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో కృష్ణ ప్రసాద్ అతిథిగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో క్రికెట్ కోచ్ రాజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఎంతోమంది విద్యార్థులు క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఈనెల 10 నుంచి 20 వరకు గుంటూరు జిల్లా పేరేచర్ల గ్రౌండ్‌లో జరిగే సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల టోర్నమెంట్ కృష్ణాజిల్లా జట్టుకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక అవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, నాయకులు తాళ్లూరి వెంకటేశ్వర్లు, శివ, వేముల విజయ్, బుజ్జి, భద్ర, కోచ్ రాజేంద్ర పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం:స్వచ్ఛంద సంస్థలు ద్వా రా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ శిబిరాల సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త చలవాది మల్లికార్జునరావు తెలిపారు. మైలవరం మదర్‌థెరీసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మహిళల కుట్టు శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు మల్లికార్జునరావు, రోటరీ క్లబ్ సహకారంతో మదర్ థెరీసా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్లు, మోటార్లు చలవాది మల్లికార్జునరావు స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ మదర్ థెరీసా ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ మహిళల్లో స్ఫూర్తి నింపుతూ వారి కుటుంబాలను ఆర్థికంగా బలపర్చుకోడానికి తమ వంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. మైలవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలవాది మధుసూదనరావు, మోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి అమీర్ హంజా, పద్మజ ట్రస్టు కో–ఆర్డినేటర్ గోపాలం మాస్టారు, జమిలిరెడ్డి, బీవీకే ప్రసాద్, ఆర్గనైజర్ గంగ,ట్రస్ట్ కోశాధికారి డి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

హామీల అమలుతో సీఎం జగన్‌కు మంచి పేరు

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జుజ్జూరులో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి అనతి కాలంలోనే ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని అల్లూరు, జుజ్జూరు గ్రామాల్లో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విశ్వసనీయ, పారదర్శక పాలన అందించటంతో పాటు నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఏ ఒక్క వర్గానికో కాకుండా అన్ని వర్గాలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ఆయన అందిస్తున్న సంక్షేమ పాలనతో తాము ప్రజల ముందుకు సగర్వంగా వెళ్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి పూర్తి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, సర్పంచ్‌లు బందెల రాణి, రమావత్ కోటి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నాగుల్‌మీరా, వేమూరి ఆదాం, వేమిరెడ్డి మోహన్‌రెడ్డి, కుంపటి శ్రీను, మోంద్రు బాయమ్మ, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఓటరు లిస్టు రూపొందించడమే లక్ష్యం

తహసీల్దార్ శంకరబాబు



వేములపల్లిలో ఓటరు లిస్టు జాబితాను పరిశీలిస్తున్న బూత్ లెవెల్ అధికారి రామారావు

కంచికచర్ల: ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమానికి గ్రామాల్లోని అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు అన్నారు. మండలంలోని గండేపల్లి, కీసర, వేములపల్లి, కంచికచర్ల, గొట్టుముక్కల, మోగులూరు, పరిటాల తదితర గ్రామాల్లో బుధవారం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బీఎల్‌ఓలు చేపట్టారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అందరి సహకారంతో నాణ్యమైన మెరుగైన ఓటరు లిస్టు తయారు చేస్తారన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలనే తలంపుతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును పారదర్శకంగా నిర్వహించాలి

వీరులపాడు: ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్‌వోలు పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు నమోదు, తొలగింపుల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో రహదారుల అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



సీసీ రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో నూతనంగా సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలను విస్తృతంగా చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక 23 వ వార్డులో మంగలిబజారులో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇక్కడ రహదారి అధ్వానంగా ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ దువ్వల రమాదేవి కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారని, దీంతో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఈ రోడ్డు నిర్మాణానికి నిధులను కేటాయించామన్నారు. రానున్న మూడు, నాలుగు రోజుల్లో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలో తమ కౌన్సిల్ ఏర్పడిన తరువాత ఇప్పటివరకు సుమారు రూ.16 కోట్ల నిధులు అభివృద్ధి పనులకు కేటాయించినట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్ దువ్వల రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ హఫీజ్, రేగళ్ల నాగరాజు, బజారు రాంబాబు, గడ్డం శ్రీకాంత్, షేక్ అజ్మద్, షేక్ షబ్బీర్, తాళ్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్దవరం ఏపీఐఐసీ భూముల పరిశీలన



రైతులు అధికారులతో కలిసి భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ: మండలంలోని పెద్దవరం ప్రాంతంలో గత ప్రభుత్వం ఏపీఐఐసీ(ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ)కు కేటాయించిన భూములను జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం సాయంత్రం పరిశీలించారు. అప్పట్లో పలు సర్వే నంబర్లలోని 515 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి కేటాయించారు. అందులోని 114 ఎకరాలలో భూమిని 186 మంది రైతులు గత 80 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి రైతులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, రాష్ట్ర ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి ఆ భూములను పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దీర్ఘకాలంగా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతోనే పరిశీలించామన్నారు. ఇక్కడ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేడు అఖిలపక్ష సమావేశం

నందిగామ: పట్టణంలోని గాంధీ సెంటర్‌లో ఉన్న విగ్రహాల తొలగింపునకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు తీర్పు నేపథ్యంలో గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 12 గంటలకు అన్ని రాజకీయ పార్టీలు, ఎన్జీవో సంఘ సభ్యులు, విద్యాసంస్థల అధినేతలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ హాజరవుతారన్నారు.

పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

నందిగామ: గత నాలుగు రోజులుగా నందిగామ ప్రాంతంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భానుడు వేసవికాలంలో మాదిరిగా తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. గత ఏడాది ఆగస్టు 9ననందిగామలో పగటి ఉష్ణోగ్రతలు 32.3 డిగ్రీలు నమోదయ్యాయి. బుధవారం నందిగామలో పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలుగా నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.